సాక్షి
సిద్దిపేట
శుక్రవారం । 14 । జూలై । 2023



ప్రయోగాత్మకం.. ఆలు సాగు

వర్షాకాలంలో ఆలు పంట సాగు ప్రయోగాత్మకంగా శ్రీకారం చుట్టారు. జహీరాబాద్ మండలం రంజోల్‌లో నారును నాటారు. 8లో..



రోడ్డు ఇలా.. రాకపోకలు ఎలా?

ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా రోడ్ల మరమ్మతులకు లక్షల్లో నిధులు మంజూరు చేస్తోంది. కానీ అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో లక్ష్యం నీరుగారుతోంది. 9లో..

ఉచిత శిక్షణకు ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలోని తెలంగాణ రాష్ట్ర బీసీ స్టడీ సర్కిల్‌లో యూపీఎస్సీ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 16న ఉదయం 9గంటలకు ఆన్‌లైన్‌లో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కృష్ణదయాసాగర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట జిల్లా నుంచి 105 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు.

న్యూస్‌రీల్

సుబ్రహ్మణ్యేశ్వరునికి భస్మార్చన



నామార్చన చేస్తున్న వేదవిద్యార్థులు

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన వర్గల్ శ్రీవిద్యా సరస్వతి క్షేత్రంలోని సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో గురువారం కృత్తిక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరుని జన్మనక్షత్రం సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు చంద్రశేఖర సిద్ధాంతి పర్యవేక్షణలో వేదపండితులు శనగల నాగరాజుశర్మ పరివారం మూలవిరాట్టుకు విశేష పంచామృత అభిషేకం చేశారు. బ్రాహ్మణోత్తములు, వేద విద్యార్థులు లక్ష సుబ్రహ్మణ్య నామాలు పఠిస్తుండగా, స్వామివారికి భస్మార్చన జరిపారు.

80 ఏళ్లకు పైబడిన ఓటర్లను గుర్తించాలి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

దుబ్బాకటౌన్: దుబ్బాక నియోజకవర్గంలో 80 సంవత్సరాలు పై బడిన ఓటర్లను గుర్తించాలని అడిషనల్ కలెక్టర్, దుబ్బాక నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ముజామ్మిల్ ఖాన్ సూచించారు. గురువారం దుబ్బాకలో ఎన్నికల నిర్వహణపై అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.

జీపీ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

హుస్నాబాద్: గ్రామ పంచాయతీ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేసి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఎం కేసీఆర్‌కు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పంపిన లేఖను గురువారం విడుదల చేశారు. బుధవారం హుస్నాబాద్ పర్యటనలో కార్మికులు వారి బాధలను విన్నవించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లవుతున్నా సమస్యలు పరిష్కరించకపోవడంతో ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారన్నారు. కార్మికుల పని విధానాల వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర స్థాయిలో అవార్డులు వచ్చాయన్నారు. వారిని వెంటనే పర్మినెంట్ చేస్తూ, కనీస వేతనం రూ.19,500 ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కేసీఆర్‌కు పంపిన లేఖలో చాడ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

బాధ్యత విస్మరించొద్దు



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ

జగదేవ్‌పూర్(గజ్వేల్): పారిశుద్ధ్య కార్మికులు తమ బాధ్యతలను విస్మరించవద్దని, పనుల్లో చేరాలని డీఎల్‌పీఓ వేదావతి అన్నారు. గురువారం జగదేవ్‌పూర్ పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు. జగదేవ్‌పూర్ పంచాయతీ స్వచ్ఛ సర్వేక్షణ్ కింద ఎంపికైందని, గ్రామంలో పారిశుద్ధ్య పనులు పూర్తి చేయాలని కోరారు. స్పందించిన కార్మికులు.. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు విధుల్లో చేరమని తేల్చిచెప్పారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎల్లయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం హామీ ఇచ్చేవరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకపోతామని డీఎల్‌పీఓ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రిటర్నింగ్ అధికారుల నియామకం

సాక్షి, సిద్దిపేట: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్నికల సంఘం సమాయత్తం అవుతుంది. అందులో భాగంగా రిటర్నింగ్ అధికారులు(ఆర్ఓ), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను గురువారం నియమించింది. సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిగా సిద్దిపేట ఆర్డీవో రమేశ్‌బాబు, దుబ్బాక ఆర్ఓగా అడిషనల్ కలెక్టర్ ముజామిల్‌ఖాన్, గజ్వేల్‌కు ఆర్ఓగా ఆర్డీవో విజయేందర్ రెడ్డి, హుస్నాబాద్‌కు ఆర్డీవో శాలోమ్, ఏఆర్ఓలుగా తహసీల్దార్లను నియమించారు. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా ఎన్నికల నియమావళి గురించి ఆర్డీవోలు, తహసీల్దార్‌లతో జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామాల్లోని ప్రజలకు ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించేందుకు ప్రచార రథాలను ఇటీవల ప్రారంభించారు.

నెట్టింట్లో విలేజ్

- సోషల్ మీడియాలో అభివృద్ధి పనులపై ప్రచారం
- ప్రతీ గ్రామ పంచాయతీకి యూట్యూబ్, ట్విట్టర్, ఫేస్‌బుక్ అకౌంట్
- గ్రామాల్లో జరిగిన, జరుగుతున్న పనుల ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్



సాక్షి, సిద్దిపేట: సోషల్ మీడియా వినియోగం ప్రతి ఒక్కరి జీవితంలో అంతర్భాగంగా మారింది. దీని ద్వారా విషయం ఏదైనా క్షణాల్లో వైరల్ అవుతుంది. గ్రామాల్లో సైతం సోషల్ మీడియా వినియోగం పెరిగిపోయింది. గతంలో పల్లెల్లో ఒక విషయాన్ని ప్రజలకు తెలియజేయాలంటే దప్పు చాటింపు వేసేవారు. ప్రస్తుత హైటెక్ యుగంలో ఆ పరిస్థితి మారిపోయింది. సోషల్ మీడియాను ఉపయోగిస్తూ ప్రతీ విషయాన్ని అందరితో షేర్ చేసుకుంటున్నారు.

గ్రామాల్లో జరుగుతున్న, చేస్తున్న అభివృద్ధి పనుల గురించి ప్రజలకు తెలియజేసేందుకు సోషల్ మీడియాను ఉపయోగించుకుంటున్నారు. గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సభలు, సమావేశాలు ఇలా ప్రతీ విషయానికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో గ్రామ పంచాయతీలు యూట్యూబ్, ట్విట్టర్, ఫేస్‌బుక్ అకౌంట్‌లను ఓపెన్ చేసి వీడియోలు, ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నారు.

గ్రామ పంచాయతీకో యూట్యూబ్ చానల్

పల్లెల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి ఫొటోలు, వీడియోలను కేంద్ర పంచాయతీరాజ్ శాఖకు పంపించాలని కోరింది. ఆయా గ్రామాల నుంచి వచ్చిన ఫొటోలు, వీడియోలు ట్విట్టర్, ఫేస్‌బుక్, యూట్యూబ్ చానల్లో ట్యాగ్ చేసి పోస్ట్ చేస్తామని ఆ శాఖ లేఖలో పేర్కొంది. అక్కడికి పంపించడంతో పాటు మన గ్రామ పంచాయతీల పేరుతోనే సోషల్ మీడియా అకౌంట్‌లు ఓపెన్ చేసి మరింత ప్రచారం చేయవచ్చు కదా అని వినూత్నంగా జిల్లా పంచాయతీ అధికారి దేవకి దేవి ఆలోచించారు. వెంటనే యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ అకౌంట్‌లను ఓపెన్ చేయించారు.

- జిల్లా వ్యాప్తంగా 499 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇప్పటి వరకు 394 గ్రామ పంచాయతీలు సొంతంగా యూట్యూబ్ చానళ్లు, 346 జీపీలు ట్విట్టర్ అకౌంట్‌లు, 340 జీపీలు ఫేస్‌బుక్ అకౌంట్‌లను ఓపెన్ చేశాయి.
- యూట్యూబ్ చానల్‌లో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను తెలుపుతూ తీసిన వీడియోలను పోస్ట్ చేస్తున్నారు.
- ట్విట్టర్, ఫేస్‌బుక్‌లలో డెవలప్‌మెంట్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలను కేంద్ర గ్రామ పంచాయతీరాజ్ శాఖ, వివిధ రాష్ట్ర స్థాయి అధికారులను ట్యాగ్ చేస్తూ పోస్ట్ చేస్తున్నారు. ఇలా చేయడంతో ఆయా గ్రామాల్లో జరిగిన అభివృద్ధి ఉన్నత అధికారులకు తెలుస్తుంది.
- గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, సలహాలను తెలియజేసేందుకు సోషల్ మీడియా దోహదపడుతుంది. ఆయా గ్రామాల్లో ఏదైన సమస్య ఉంటే ట్విట్టర్ ద్వారా ఆ గ్రామ పంచాయతీ అకౌంట్‌ను ట్యాగ్ చేసి పోస్ట్ చేస్తున్నారు. వెంటనే ట్విట్టర్‌కు స్పందించి సమస్య పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శులు కృషి చేస్తున్నారు.

అన్ని పంచాయతీలకు సోషల్ మీడియా అకౌంట్



ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాను వినియోగిస్తున్నారు. దీని ద్వారా ఏ సమాచారమైనా ప్రజల్లోకి త్వరగా వెళ్తుంది. అన్ని గ్రామాల్లో యూట్యూబ్ ఛానల్, ట్విట్టర్, ఫేస్‌బుక్ అకౌంట్‌లను ఓపెన్ చేపిస్తున్న. ఈ నెల చివరి వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో సోషల్ మీడియా అకౌంట్‌లను ఓపెన్ చేపిస్తాం.

– దేవకిదేవి, డీపీఓ

స్పందన బాగుంది

యూట్యూబ్, ట్విట్టర్, ఫేస్‌బుక్ ద్వారా గ్రామంలో చేస్తున్న అభివృద్ధి, ఇతర విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వీడియోలను తీసి పోస్ట్ చేస్తున్నాం. ప్రజల నుంచి స్పందన బాగుంది. ఇంకా రావాలి. మా పాలక వర్గం సహకారంతో వీడియోలను రూపొందిస్తున్నాం. యూట్యూబ్ చానల్ కోసం గ్రామానికి చెందిన రాకేష్ తొలి వీడియో ఎడిటింగ్ చేశాడు. తర్వాత నేను ఎడిటింగ్ నేర్చుకుని వీడియోలు పోస్ట్ చేస్తున్న.

–ఎం.రాధ, పంచాయతీ కార్యదర్శి, ధర్మసాగర్‌పల్లి

స్వచ్ఛ్ ధర్మసాగర్‌పల్లి

కోహెడ మండలం ధర్మసాగర్‌పల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో స్వచ్ఛ్ ధర్మసాగర్‌పల్లి అనే యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించారు. ఇప్పటి వరకు 11 వీడియోలను పోస్ట్ చేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పల్లెప్రగతి దినోత్సవంపై, చెరువుల పండగ సందర్భంగా, గ్రామంలో జరుగుతున్న కంటి వెలుగు శిబిరం, రుతుప్రేమ కార్యక్రమంపై మూడు వీడియోలు, మరుగుదొడ్ల వాడకం పై అవగాహన కల్పించేందుకు, ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని, గ్రామ అభివృద్ధి పైన నీకు లేదా బాధ్యత అనే వాటిని పై వీడియోలను తీసి పోస్ట్ చేశారు. ఇలా యూట్యూబ్ ద్వారా గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ధర్మసాగర్‌పల్లి ఆదర్శంగా నిలుస్తోంది.



ధర్మసాగర్‌పల్లి గ్రామ యూట్యూబ్ చానల్ అకౌంట్

వీరశైవ లింగాయత్ మహాసభను విజయవంతం చేయండి



కరపత్రాన్ని విడుదల చేస్తున్న అర్చకులు

కొమురవెల్లి(సిద్దిపేట): ఈనెల 23వ తేదీన సిద్దిపేటలో జరిగే వీరశైవ లింగాయత్ మహాసభను విజయవంతం చేయాలని వీరశైవ లింగయత్ రాష్ట్ర నాయకులు ఆకుల భద్రప్ప అన్నారు. గురువారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల, మత నిర్మూలనకు గతంలో బసవేశ్వరుడు కృషి చేశాడని అన్నారు. రాష్ట్రంలోని వీరశైవులంతా ఒక్కటై విద్యారంగంలో ఓబీసీని సాధించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ అధ్యక్షులు బి.యాదగిరి, పత్తి శంకరయ్య, ఆకుల ప్రశాంత్ కుమార్, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, స్థానచార్యులు మల్లయ్య, మహాదేవుని సాంబయ్య, పడిగెన్నగారి మల్లికార్జున్, భాస్కర్, రవి, వినయ్‌కుమార్, శివప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాల సీజ్

సిద్దిపేటజోన్: అనుమతి లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలను సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అదనపు బ్రాంచ్ ప్రారంభించిందని ఆరోపిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం శ్రీ చైతన్య ఫోర్త్ బ్రాంచ్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అరవింద్ మాట్లాడుతూ.. అనుమతి లేకుండా సిద్దిపేటలో శ్రీ చైతన్య అదనంగా బ్రాంచ్ ఏర్పాటు చేశారని తెలిపారు. పాఠశాల పేరు చెప్పి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజుల రూపంలో లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న విద్యాధికారి అక్కడకు వచ్చి పాఠశాలను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ్, సంతోష్, హరీశ్, అక్షయ్ పాల్గొన్నారు.



సీజ్ చేస్తున్న అధికారి

భక్తిశ్రద్ధలతో బోనాలు



పోతరాజుల విన్యాసాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని కేసీఆర్ నగర్, గుండ్ల చెరువు డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయంలోని మైసమ్మ, ముత్యాల పోచమ్మ దేవాలయాల్లో గురువారం వైభవంగా బోనాల పండగను నిర్వహించారు. డప్పు చప్పుళ్ల, పోతరాజుల విన్యాసాల నడుమ మహిళలు బోనాలతో ఆలయాలకు చేరుకొని అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, కౌన్సిలర్ నాయిని చంద్రం, మాజీ కౌన్సిలర్ బండారి నర్సింలు, ఎల్లమ్మ గుడి నిర్మాణ దాత సీహెచ్ అరవింద్, మైసమ్మ, ముత్యాల పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు గట్టయ్య, వీరేశం, జెల్ల పద్మ, పద్మశ్రీ రెడ్డి, సింగోజు మురళీకృష్ణ ఆచార్యులు, భవాని, లక్ష్మి, మంజుల, పద్మ, బిక్షపతి, కనకయ్య, యాకయ్య, నాగరాజు, నరేష్, గణేష్, తిరుపతి, ఆస్మ తదితరులు పాల్గొన్నారు.

క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ చేయాలి

సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత



మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత పోలీసు అధికారులకు సూచించారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో సిద్దిపేట, గజ్వేల్ పోలీసు అధికారులతో పెండింగ్ కేసులపై గురువారం సీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా డిస్పోజల్ చేయాలని, నాన్ బెయిలబుల్ వారెంట్ అమలు చేయాలన్నారు. పోక్సో, ఎస్సీ ఎస్టీ కేసుల్లో 60రోజుల్లో ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలకు సైబర్ నేరాలు, మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించాలని అన్నారు. నేరస్థులు, అనుమానితుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. పెండింగ్ ఉన్న సీసీ నెంబర్లు వారం రోజులలో తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి, వన్ టౌన్ సీఐ బిక్షపతి, టూటౌన్ సీఐ రవికుమార్, త్రీ టౌన్ సీఐ భానుప్రకాష్, రూరల్ సీఐ జానకీరామ్‌రెడ్డి, గజ్వేల్ సీఐ వీరప్రసాద్, ఎస్‌బీ సీఐ రఘుపతిరెడ్డి, మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

ఆయిల్ పామ్ సాగు లక్ష్యం పూర్తి చేయాలి

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: ఆయిల్ పాం సాగులో వేగాన్ని పెంచి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరేలా అధికారులు పని చేయాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యాన వన, ఆయిల్ ఫ్రెడ్ కార్పొరేషన్, డ్రిప్ కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో సుమారు 2,059 ఎకరాలలో ఆయిల్ పాం సాగులోకి వస్తుందని, ఇప్పటివరకు 600 ఎకరాలకు పైగా మొక్కలు నాటినట్లు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సునిత వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు ఆయిల్ పాం సాగును ప్రోత్సహించాలని అన్నారు. ఈ నెలలో సగం టార్గెట్ పూర్తి చేయాలని సూచించారు. ఏఈఓలు రైతుల దగ్గరకు వెళ్లి ఆయిల్ పాం సాగు వల్ల కలిగే లాభాల గురించి వివరించాలన్నారు. రైతులను ఎంపిక చేసి డీడీ కలెక్షన్లు, మార్కింగ్, డ్రిప్ ఫిట్టింగ్, మొక్కలు నాటే ప్రక్రియను వేగంగా చేపట్టాలని తెలిపారు. రోజువారీగా ఫీల్డ్‌లో జరిగిన విషయాలను ఎప్పటికప్పుడు డీఏఓ తెలుసుకోవాలని ఆదేశించారు. ఏఓలు మండలాల వారీగా పనిలో వెనకబడిన క్లస్టర్లను పర్యవేక్షించాలని అన్నారు. చిన్న, సన్నకారు రైతులను కూడా ఆయిల్ పాం సాగు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. అంతర పంటగా జనుము, జీలుగ పంటలు వేయడం ద్వారా ఆయిల్ పాం మొక్కకి కర్బన శాతం, నత్రజని అధికంగా అందుతుందని తెలిపారు. తద్వార కలుపు బెడద ఉండకుండా, నేలలో చవుడు కూడా తగ్గుతుందన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, ఆయిల్ ఫ్రెడ్ కార్పొరేషన్ మేనేజర్ సురేందర్ రెడ్డి, కార్పొరేషన్ ఇంచార్జి సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొండపాకలో భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్)/కొండపాక(గజ్వేల్)/మర్కూక్ (గజ్వేల్): యుద్ధ ప్రాతిపదికన ఐఓసీ కార్యాలయాల భవన నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. గురువారం జగదేవ్‌పూర్, కొండపాక, మర్కూక్‌లో నిర్మిస్తున్న భవనాల నిర్మాణ పనులను పరిశీలించారు. దసరా లోపు నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాలని, నిధుల కొరత ఉంటే మళ్లీ మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీపీ బాలేషంగౌడ్, పీఆర్ ఈఈ శ్రీనివాస్, డీఈ ప్రభాకర్, ఏఈ దేవయ్య, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ ర్యాగల్ల దుర్గయ్య, పీఆర్ ఏఈ తిరుపతిరెడ్డి, ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మరాంచంద్రం, అధికారులు పాల్గొన్నారు.

తాత్కాలిక రవాణా కార్యాలయం ఏర్పాటు చేయండి

జిల్లా రవాణా శాఖ అధికారులను కలిసిన ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తన సొంత ఖర్చులతో అందజేస్తున్న ఉచిత డ్రైవింగ్ లైసెన్సుల కోసం 12 వేల దరఖాస్తులు వచ్చాయని, దుబ్బాకలో తాత్కాలిక రవాణా కార్యాలయం ఏర్పాటు చేస్తే అందరికీ వెసులుబాటుగా ఉంటుందని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు విజ్ఞప్తి చేశారు. గురువారం సిద్దిపేట జిల్లా రవాణా శాఖ అధికారులను ఎమ్మెల్యే కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్సుల కోసం దుబ్బాక నియోజకవర్గం నుంచి సిద్దిపేటకు రావడానికి ఇబ్బంది పడుతున్నారని, దుబ్బాకలో తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. తన విజ్ఞప్తిని డీటీఓ సానుకూలంగా స్పందించి అది కమిషనర్ పరిధిలో ఉంటుందని చెప్పడంతో, వారిని ఫోన్ ద్వారా సంప్రదించినట్లు తెలిపారు. పరిశీలించి దుబ్బాకలో తాత్కాలిక కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విభీషణ్‌రెడ్డి, బాలేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

పుస్తకాల పంపిణీ

సంపర్క్ సే సమర్థన్‌లో భాగంగా దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని దుబ్బాక, లచ్చపేటలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 9 ఏళ్ల సుపరిపాలన గురించి ఎమ్మెల్యే రఘునందన్‌రావు వివరించడంతో పాటుగా ప్రత్యేకంగా ముద్రించిన పుస్తకాలను అందించారు. అనంతరం దుబ్బాక పట్టణంతో పాటు పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు.

పరిసరాలు బాగుంటేనే ఆరోగ్యం

సిద్దిపేటజోన్: పరిసరాలు బాగుంటేనే ఆరోగ్యం బాగుంటుందని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్ అన్నారు. గురువారం ఆయన మున్సిపల్ కమిషనర్ సంపత్, పాలకవర్గ సభ్యులతో కలిసి 40వ వార్డులో ఇంటింటికి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుపై ఉన్న చెత్తా చెదారం తొలగించారు. పోలీస్ క్వార్టర్స్‌లో మున్సిపల్ సిబ్బందితో కలిసి శ్రమదానం చేపట్టారు. చెత్త సేకరణ వాహనాలు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల పనితీరుపై ఆరా తీశారు. ఆరు బయట చెత్త వేయకూడదని ప్రజలకు సూచించారు. చెత్త, ప్లాస్టిక్ రహిత సిద్దిపేట లక్ష్యంగా మంత్రి హరీశ్‌రావు పనిచేస్తున్నారని, ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. మురికి కాలువల్లో చెత్త, మట్టి లేకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. వారి వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు తిరుమాల్, మల్లికార్జున్, సురేష్, ఎల్లం, మోహిజ్, రఘురాం, లక్ష్మణ్, సుందర్, సాయి, మహేందర్, రాజేశం నాగరాజు, ప్రవీణ్, శ్రీహరి, రాజు, విజయేందర్,కోఆప్షన్ సభ్యులు సత్తయ్య, మాజీ కౌన్సిలర్ ప్రభాకర్, మున్సిపల్ అధికారులు సతీష్, వనిత, పృథ్వీ, అన్వేష్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



వార్డులో సేకరించిన చెత్తతో పాలకవర్గ సభ్యులు

రైతులకు రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్: రైతులకు మూడు గంటలు ఉచిత కరెంట్ చాలన్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలని, లేదంటే గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను తిరగనివ్వమని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ హెచ్చరించారు. వ్యవసాయానికి 24 కరెంట్ సరఫరాపై రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నియోజకవర్గ స్థాయిలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం సబ్‌స్టేషన్ ఎదుట ఆయన దిష్టిబొమ్మను చెట్టుకు ఉరివేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికి జైలుకు వెళ్లిన రేవంత్ రెడ్డి తెలంగాణపై అవగాహన లేకుండా మాట్లాడటం సరికాదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 24 గంటల ఉచిత కరెంట్, వ్యవసాయానికి నీళ్లు కూడా ఇవ్వరన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో రైతులు, ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. సీఎం కేసీఆర్ రైతులకు కొండంత అండగా ఉంటే, కాంగ్రెస్ పార్టీ మాత్రం రైతుల పొట్టకొట్టేందుకు చూస్తుందన్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోసం రైతులు ఇబ్బంది పడ్డారని, స్వరాష్ట్రంలో పుష్కలంగా నీళ్లు, నాణ్యమైన కరెంట్ సరఫరాతో ఆర్థికంగా ఎదుగుతున్న రైతులను మళ్లీ చీకట్లోకి నెట్టే కాంగ్రెస్ ప్రయత్నాలను ప్రజలు తిప్పికొడతారన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పి బంగాళఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, సిద్దిపేట జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కర్ర శ్రీహరి, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, ఎంపీపీలు లకావత్ మానస, మాలోతు లక్ష్మి, అనిత, స్వప్న, వినీత, జడ్పీటీసీలు భూక్య మంగ, శ్యామల, రవీందర్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజని తదితరులు పాల్గొన్నారు.



రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

క్లుప్తంగా

కల్యాణలక్ష్మి అవకతవకలపై విచారణ


విచారిస్తున్న అధికారులు

చేగుంట(తూప్రాన్): పెళ్లి జరిగిన రోజును మార్చి కల్యాణలక్ష్మి డబ్బులు తీసుకున్న విషయంలో పెద్దశివునూర్ గ్రామంలో గురువారం మండల ప్రత్యేక అధికారి జయరాజ్ విచారణ జరిపారు. గ్రామానికి చెందిన మనెగల్ల ఎల్లం కూతురు మానస వివాహం 2017, ఫిబ్రవరి 15న జరిపించారు. అప్పటికి మానస మైనర్ కావడంతో 2000, ఫిబ్రవరి 26న పెళ్లి జరిగినట్లు వివాహ పత్రికను సృష్టించి కల్యాణలక్ష్మి కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో కల్యాణలక్ష్మి డబ్బులు మంజూరయ్యాయి. ఇది తెలిసిన కొందరు తప్పుడు పత్రాలతో కల్యాణలక్ష్మి డబ్బులు మంజూరు చేయించుకున్నట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

ఈ విషయం తెలుసుకున్న మండల ప్రత్యేక అధికారి జయరాజ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్ యాదవ్‌లు గ్రామ పంచాయతీలో విచారణ జరిపి పలువురి వాగ్మూలాలను నమోదు చేసుకున్నారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు పంపించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ప్రత్యేక అధికారి జయరాజ్ పేర్కొన్నారు. విచారణలో సర్పంచ్ రుక్మిణీభాయి జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్‌తో పాటు ఎల్లం కుటుంబీకులు స్థానికులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఏసీపీ రమేశ్

గజ్వేల్‌రూరల్: అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ ఏసీపీ రమేశ్ సూచించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత సూచనల మేరకు పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం సీఐ వీర ప్రసాద్‌తో కలిసి మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేష్ మాట్లాడుతూ విద్యార్థినులు ఇప్పటి నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండి తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేసుకోవాలని సూచించారు. నేరాలు జరిగిన వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. షీటీమ్ విధులు, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టాలు, బాల్య వివాహాలు, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్స్, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, మైనర్ డ్రైవింగ్, సమాజ రుగ్మతలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు, మహిళలు ఏవైనా ఇబ్బందులకు గురైతే 100 లేదా షీటీమ్ (8712667343), స్నేహిత మహిళాసపోర్ట్ సెంటర్(9494639498), మహిళా పోలీస్ స్టేషన్(8712667435)లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శశికళ, గజ్వేల్ షీటీమ్ ఏఎస్ఐ అమృత్, హెడ్ కానిస్టేబుల్ సంజీవరెడ్డి, కానిస్టేబుళ్లు యుగేందర్, అన్వేష్, మహిళా కానిస్టేబుల్ జ్యోతి, కళాశాల అధ్యాపక బృందం, పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని పాడిగేదె మృతి


గేదె కళేబరం

శివ్వంపేట(నర్సాపూర్): ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో పాడిగేదె మృతిచెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన పట్నం నర్సింలు వ్యవసాయ సాగుతో పాటు పశుపోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజువారిగానే తన పశువులను మేతకు తీసుకెళ్లాడు. మేత మేసిన అనంతరం పశువులను గ్రామానికి తీసుకొస్తున్న క్రమంలో రోడ్డు దాటుతుండగా సంగారెడ్డి ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సు పాడి గేదెను ఢీకొంది. ఈ ఘటనలో పాడి గేదె మృతి చెందింది.

గాయపడ్డ నెమలికి చికిత్స

నారాయణఖేడ్: రోడ్డుప్రక్కన గాయాలతో పడి ఉన్న ఓ నెమలిని యువకుడు రక్షించి చికిత్స చేయించి అటవీశాఖ అధికారులకు అప్పజెప్పాడు. వివరాలు ఇలా ఉన్నాయి..నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్ తండాకు చెందిన యువకుడు మోహన్ గురువారం సాయంత్రం మోటారుసైకిల్‌పై నారాయణఖేడ్‌కు వస్తుండగా రోడ్డుపక్కన ఓ నెమలి గాయమై కనిపించింది. దీన్ని గమనించిన మోహన్ దాన్ని తీసుకొచ్చి ఖేడ్ పశువైద్యశాలలో చికిత్స చేయించాడు. అనంతరం స్థానిక అటవీశాఖ సిబ్బందికి అప్పగించారు. మోహన్‌ను అటవీశాఖ సిబ్బంది అభినందించి. అది పూర్తిగా కోలుకున్నాక అడవిలో వదిలేస్తామని అధికారులు తెలిపారు.

ప్రయోగాత్మకం.. ఆలు సాగు

వర్షాధారం కింద పంట
- ఏ మేరకు వస్తుందనే దానిపై పరిశీలన
- రంజోల్‌లో ఎకరం పొలంలో నాటిన ఆలుగడ్డ నారు
- బెంగుళూరు నుంచి తీసుకొచ్చిన మొక్కలు


బొప్పాయిలో అంతర పంటగా సాగు చేసిన ఆలు

జహీరాబాద్: వర్షాకాలంలో ఆలు పంట సాగు ప్రయోగాత్మకంగా శ్రీకారం చుట్టారు. గురువారం జహీరాబాద్ మండలంలోని రంజోల్ గ్రామంలో అపైకల్ రూట్ కటింగ్ విధానంలో పెంచిన నారును పొలంలో నాటారు. గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రెడ్డి వద్ద అర ఎకరం, జగన్నాథ్‌రెడ్డి వద్ద మరో అర ఎకరంలో ఆలు నారు మొక్కలను నాటారు. కర్ణాటక రాష్ట్రం, బెంగుళూరులోని హసన్ ప్రాంతంలో ఉన్న ల్యాబ్‌లో ఎఫ్ఓ హైబ్రీడ్ కుఫ్రీ హిమాలిని ఆలుగడ్డ నారు మొక్కలను పెంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. అక్కడి నుంచి రైతులు గ్రామానికి తెచ్చుకుని నాటారు. సెంట్రల్ పొటాటో ఇనిస్టిట్యూట్ తరఫున రైతులకు ఉచితంగా ఆలుగడ్డ నారు మొక్కలను సరఫరా చేశారు. ఇండోనేషియా టెక్నాలజీలో క్రాఫ్‌ను డెవలప్‌చేసి దాని ఆధారంగా పొటాటో ఇనిస్టిట్యూట్‌లో ఏఆర్‌సీ విధానంలో ఆలు మొక్కలను పెంచి సాగుకు ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం బెంగుళూరు ప్రాంతంలో వర్షాకాలంలో సాగు చేస్తున్న ఆలుగడ్డ పంట మంచి ఫలితాలనిస్తుంది. మొదటి సారిగా జహీరాబాద్‌లో మూడు ఎకరాల్లో ప్రయోగాత్మకంగా సాగు చేయాలని ఉద్యానవన శాఖ నిర్ణయించింది. ప్రస్తుతం ఎకరం భూమిలో సాగును పూర్తి చేశారు. మరో రెండెకరాల్లో సాగు చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎకరం పొలంలో 30వేల మొక్కలు అవసరం అవుతాయని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఒక్కో మొక్క ఖరీదు రూ.3లు ఉందన్నారు. ఇంత ఖరీదైనది కావడంతో రైతులకు సాగు భారం అవుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఏఆర్‌సీ విధానాన్ని విస్తృతం చేస్తే తక్కువ ఖర్చుతో మొక్కలు లభ్యమయ్యే అవకాశం ఉంటుందంటున్నారు. వర్షాకాలంలో సాగు చేసుకునే ఆలుగడ్డ పంటకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుంది. అన్ సీజన్ కావడమే ఇందుకు కారణం. ప్రస్తుతం యాసంగిలో సాగుచేస్తున్న ఆలుగడ్డ పంటకు నల్ల మచ్చల తెగుళ్లు, వైరస్ తెగుళ్లు అధికంగా సోకుతున్నందునా పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతున్నందునా రైతులకు గిట్టుబాటు కావడం లేదనే ఉద్దేశ్యంతో నారు విధానంలో ఆలు మొక్కలను ప్రోత్సహించేందుకు చేస్తున్న ప్రయత్నమని చెబుతున్నారు.


నారును పరిశీలిస్తున్న రైతులు


నాటేందుకు నారును తీసుకెళ్తున్న కూలీ

ఏమేరకు ఫలితం ఉంటుందనేదానిపై దృష్టి..

ప్రస్తుతం వర్షాకాలంలో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న ఆలుగడ్డ పంట దిగుబడులు ఏమేరకు ఉంటాయనే దానిపై ఉద్యానవన శాఖ దృష్టి పెట్టింది. జూన్, జూలైలో సాగు చేయడం ద్వారా సెప్టెంబర్‌లో పంట చేతికి వస్తుందని భావిస్తున్నారు. ఇలా వచ్చిన పంటలో నాణ్యమైన పంటను మార్కెట్లో విక్రయించుకుని, మిగిలిన చిన్న చిన్న దుంపలు, పచ్చ దుంపలను యాసంగిలో విత్తనంగా వినియోగించుకోవచ్చనే విషయమై పరిశీలిస్తున్నారు. యాసంగిలో చలి అధికంగా ఉండడంతో పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. వర్షాకాలంలో వాతావరణం ఏమేరకు అనుకూలంగా ఉంటుందనేది కూడా ప్రయోగంలో తెలుస్తుంది. కుఫ్రీ హిమాలిని రకం ఇక్కడి వాతావరణం, నేలకు ఎంత మేర ఉపయోగకరంగా ఉంటుందనే దానిపై అధ్యాయనం చేస్తున్నారు. ప్రతి ఏటా రైతులు యాసంగిలో మాత్రమే ఆలుగడ్డ పంటను సాగు చేసుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా ప్రాంతం నుంచి విత్తనాన్ని కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు.

అంతర పంటగా వేశాను..



ఉద్యానవన శాఖ ఉచితంగా ఆలుగడ్డ నారు మొక్కలను అందజేసింది. దీంతో ప్రయోగాత్మకంగా అర ఎకరంలో 11వేల మొక్కల వరకు సాగు చేశాను. ప్రస్తుతం బొప్పాయి పంట సాగులో ఉంది. అందులోనే అంతర పంటగా వేశాను. పంట బాగా వస్తే భవిష్యత్తులో రైతులు ఈ విధానంలో సాగు చేసే అవకాశం ఉంది. వర్షాకాలంలో కూడా ఈ ప్రాంతంలో విస్తారంగా సాగుకు బీజం పడుతుంది.

–నల్ల నాగేశ్వర్‌రెడ్డి, రైతు, రంజోల్

ప్రయోగం మాత్రమే



ప్రస్తుతం ఆలుగడ్డ మొక్కలను ప్రయోగాత్మకంగానే సాగు చేయిస్తున్నాం. బెంగుళూరు ప్రాంతంలో మంచి ఫలితాలనిస్తున్నందునా సెంటర్ పొటాటో ఇనిస్టిట్యూట్ తరపున కుఫ్రీ హిమాలిని అనే రకం ఆలును వర్షాధారంగా సాగు చేయిస్తున్నాం. అవసరమనుకుంటే నీటిని అందించాల్సి ఉంటుంది. ఇది విజయవంతం అయితే సాగును ప్రోత్సహిస్తాం.

–అనూషరెడ్డి, ఉద్యానవన అధికారి, జహీరాబాద్

భక్తి శ్రద్ధలతో బోనాలు


నర్సాపూర్‌లో ఫలహార బండి ఊరేగింపులో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్: నర్సాపూర్ పట్టణ ప్రజలు భక్తి శ్రద్ధలతో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి సాయంత్రం ఫలహార బండ్లు ఊరేగించారు. బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే చిలుములమదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్, తెలంగాణ పీసీసీ ఉపాధ్యక్షుడు మెదక్ పార్లమెంటు ఇన్‌చార్జ్ గాలి అనిల్‌కుమార్ తదితరులు ఆలయాల్లో పూజల్లో పాల్గొన్నారు. ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన ఫలహార బండ్ల ఊరేగింపులో హాజరయ్యారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయాలు, ఫలహార బండ్ల నిర్వాహకులు ఆయా పార్టీల నాయకులను శాలువా కప్పి సన్మానించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


కొమురయ్య మృతదేహం

కొండపాక(గజ్వేల్): విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందాడు. ఈ సంఘటన కుకునూరుపల్లి మండలంలోని తిప్పారంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కొమురయ్యకు తనకున్న వ్యవసాయ భూమితో పాటు అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆకుల భద్రప్ప వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. కౌలుకు తీసుకున్న వ్యవసాయ పొలం వద్ద బోరు మోటార్‌కు విద్యుత్తు సరఫరా కాకపోవడంతో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్‌ను సరి చేస్తుండగా ప్రమాదవ శాత్తు విద్యుదాఘాతానికి గురై ఇరుసాల కొమురయ్య మృతి చెందాడు. మృతుని భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పుశ్పరాజ్ తెలిపారు.

జీవితంపై విరక్తితో ఇద్దరి ఆత్మహత్య

మెదక్ మున్సిపాలిటీ: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కలాన్‌శెట్టిపల్లి గ్రామానికి చెందిన బాగిర్థిపల్లి కళావతి సిద్దిరాంలు పెద్ద కుమారుడైన భాగిర్థిపల్లి రాజు(35) గత కొంతకాలంగా మెదక్‌పట్టణంలోని నర్స్‌ఖేడ్ వీధిలో నివాసం ఉంటున్నాడు. 2017లో కొంతంపల్లి గ్రామానికి చెందిన పోచమ్మతో పెళ్లి జరిగింది. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా పోచమ్మ రాజును వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ విషయంలో తరచూ బాధపడుతు ఉండేవాడు. బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో రాజు స్థానిక మల్లెం చెరువు ఒడ్డున చింతచెట్టుకు ఉరివేసుకున్నాడు. మృతుని తల్లి కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పోచయ్య పేర్కొన్నారు.

జహీరాబాద్‌లో..


వెంకటేశ్వర్ (ఫైల్)

జహీరాబాద్: మనోవేదనకు గురై యువకుడు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం ..కాశీంపూర్ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్(27) ఉన్నత చదువులు చదివినప్పటికీ ఉద్యోగం రాలేదు. దీంతో హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో కరోనా సమయంలో గ్రామంలోనే ఉండిపోయి ప్రభుత్వ ఉద్యోగం రాలేదని మనోవేదనకు గురయ్యేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది గురువారం గ్రామంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

హత్యకేసులో ఆరు సంవత్సరాల జైలు

పటాన్‌చెరు టౌన్: హత్యకేసులో ఓ వ్యక్తికి ఆరు సంవత్సరాల జైలు శిక్ష విధించిన సంఘటన భానూర్–బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..అస్సాం నుంచి బతుకుదెరువు కోసం వచ్చి పాశమైలారం పారిశ్రామికవాడలో పనిచేసుకుంటూ అద్దె రూంలో బిశ్వేశ్వర్ బోరా, బుపెన్‌బోరాలు ఉంటున్నారు. ఈ క్రమంలో 2020, సెప్టెంబర్, 13 తేదీన రూమ్‌లో గొడవ జరిగి బుపెన్‌బోరాను బిశ్వేశ్వర్ బోరా హత్యచేశాడు. అప్పట్లో బీడీఎల్ సీఐ రాంరెడ్డి నిందితుడు బిశ్వేశ్వర్ బోరను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. గురువారం వాదోపవాదాలు విన్న నాలుగో అడిషనల్ సెషన్ కోర్టు న్యాయమూర్తి లావణ్య నిందితుడైన బిశ్వేశ్వర్ బోరాకు ఆరు సంవత్సరాల జైలు శిక్షను విధించినట్లు పోలీసులు తెలిపారు.

సైబర్ వలలో ప్రైవేట్ ఉద్యోగి..

పటాన్‌చెరు టౌన్: వాట్సాప్‌కు వచ్చిన మెసేజ్‌కు స్పందించి ఓ ప్రైవేట్ ఉద్యోగి రూ.7.90లక్షలు పోగొట్టుకున్నాడు. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం..పటాన్‌చెరు మండల పరిధిలోని ఘణపూర్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగికి జూన్ 8వ తేదీన వాట్సాప్‌కు ఓ మెసేజ్ వచ్చింది. దీనికి స్పందించి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో బాధితునికి గిఫ్ట్ వచ్చిందని చెప్పి నమ్మించాడు. బాధితుడు ముందుగా రూ.4వేలు చెల్లించాడు. అనంతరం గిఫ్ట్‌లు గోల్డ్‌సెట్, ఐఫోన్, ట్యాబ్, బంగారు గాజులతో పాటు రూ.16 లక్షల నగదు ఎయిర్ పోర్ట్‌కు వచ్చాయని, వాటికి ట్యాక్స్ కట్టాలని పలు దఫాలుగా సైబర్ నేరగాళ్లు బాధితుడి నుంచి రూ.7,90,000లు చెల్లించాడు. ఇంకా నగదు చెల్లించాలని అడగడంతో అనుమానం వచ్చిన బాధితుడు తను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం భానూర్–బీడీఎల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పెళ్లి విషయంలో తండా వాసుల ఘర్షణ

శివ్వంపేట(నర్సాపూర్): యువతిని ప్రేమించిన యువకుడితో పెళ్లి జరిపించే విషయంలో తండా వాసులు ఘర్షణ పడ్డారు. ఓ తండాకు చెందిన యువతిని మరో తండాకు చెందిన యవకుడు ప్రేమించాడనే విషయం ఇంట్లో తెలియడంతో యువతిని 4 నెలల క్రితం మరో వ్యక్తితో పెళ్లి జరిపించారు. గత కొన్నాళ్ల నుంచి పెళ్లయిన యువతిని ప్రేమించిన వ్యక్తి ఫోన్ సంభాషణ చేస్తూనే పాటు పాత ఫోటోలు పెట్టాడు. ఈ విషయం భర్తతో పాటు వారి కుటుంబ సభ్యులకు తెలియడంతో యువతిని పుట్టింటికి పంపించేశారు. ఈ విషయంపై ఇరు తండావాసుల పెద్దలు రెండు రోజుల క్రితం పంచాయితీ పెట్టారు. పెళ్లి చేసుకున్న వ్యక్తితో ప్రేమ వ్యవహారం గొడవకు దారితీసినందునా యువతిని ప్రేమించిన యువకుడు పెళ్లి చేసుకోవాల్సిందిగా ఇరు తండా పెద్దలు నిర్ణయించారు. అందుకు యువకుడు సైతం ఒప్పుకున్నాడని మరుసటి రోజు పెళ్లి చేసుకోనని మాటమార్చడంతో ప్రేమ వ్యవహారం పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. గురువారం ఇరు తండావాసులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని గొడవ పడ్డారు. మరోమారు ఇరు తండా పెద్దలు పోలీస్‌స్టేషన్‌లో చర్చించినప్పటికి కొలిక్కి రాలేదు. యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రిపై కొడుకు దాడి

చికిత్స పొందుతూ మృతి


రాజయ్య మృతదేహం

నంగునూరు(సిద్దిపేట): భూమి విషయమై జరిగిన గొడవలో తండ్రిపై కొడుకు దాడి చేయగా చికిత్స పొందుతూ తండ్రి మృతి చెందిన సంఘటన ఘణపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..నంగునూరు మండలం ఘణపూర్ గ్రామానికి చెందిన ఎర్రవెల్లి రాజయ్య (65) భార్య కనకవ్వ, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు రవి వ్యవసాయం చేస్తూ గ్రామంలో నివసిస్తుండగా చిన్నకుమారుడు రాజమల్లు బతుకుదెరువు కోసం సిద్దిపేట వెళ్లాడు. బుధవారం రాత్రి తండ్రితో కలసి మద్యం సేవించిన రవి వ్యవసాయ భూమిని కౌలుకు ఇచ్చే విషయమై తండ్రితో గొడవ పడి కర్రతో కొట్టాడు. ఈ ఘటనలో రాజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గురువారం ఉదయం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రాజయ్య మృతి చెందాడు. చిన్న కుమారుడు రాజమల్లు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజుగౌడ్ తెలిపారు.

రెండు ఇళ్లు దగ్ధం


కాలిపోయిన ఇల్లు

మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండలం మేఘ్యానాయక్ తండాలో గురువారం మధ్యాహ్నం రెండు ఇళ్లు దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..తండాకు చెందిన బానోత్ సుకులాల్, బానోత్ నరేందర్‌లకు చెందిన రెండు ఇళ్లు దగ్ధం కాగా స్థానికులు అప్రమత్తమయ్యి మంటలను ఆర్పారు. అప్పటికే ఇళ్లలో ఉన్న నిత్యావసర వస్తువులు, ధాన్యం పూర్తిగా కాలిపోయాయి. సుకులాల్ ఇంట్లో రూ.5లక్షల నగదు, నరేందర్ ఇంట్లో తులం బంగారం, 15తులాల వెండి, బట్టలు కాలిపోయాయని తెలిపారు. అగ్ని ప్రమాదానికి కారణం షాట్ సర్క్యూట్ ఉండొచ్చని తండావాసులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మండల రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వగా తహసీల్దార్ కిషన్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామ నిర్వహించి వివరాలు సేకరించారు. కాగా బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

కల్వర్టును ఢీకొట్టిన ప్రైవేట్ స్కూల్ బస్సు


కల్వర్టును ఢీకొట్టిన స్కూలు బస్సు

వట్‌పల్లి(అందోల్): ప్రైవేట్ స్కూల్ బస్సు బ్రేకులు ఫెయిల్అయి కల్వర్టును ఢీకొట్టిన ఘటన గురువారం పోతులబోగుడా గ్రామ శివారులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..వట్‌పల్లి అక్షర పాఠశాల స్కూల్ బస్సు గురువారం ఉదయం చేవెళ్ల పోతులబోగుడా గ్రామాల నుంచి పిల్లలను పాఠశాలకు తీసుకురావడానికి వెళ్తున్న సమయంలో బస్సు బ్రేకులు ఫెయిల్అయి అదుపు తప్పి రోడ్డుపక్కనే ఉన్న కల్వర్టును ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు భాగం ధ్వంసమవడంతో పాటు అద్దాలు పగిలాయి. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో విద్యార్థులు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు వాపోయారు.

ప్రమాదవశాత్తు కాల్వలో పడి పూజారి మృతి


సత్యనారాయణచార్యుల మృతదేహం

సిద్దిపేటకమాన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన పూజారి ప్రమాదవశాత్తు కాలుజారి కాల్వలో పడి మృతి చెందాడు. సిద్దిపేట వన్‌టౌన్ సీఐ బిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం..మరిగంటి సత్యనారాయణచార్యులు(51) పూజారిగా విధులు నిర్వహిస్తూ గణేష్‌నగర్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఈ నెల11వ తేదీన ఇమాంబాద్ గ్రామ శివారులో పూజ ఉందని ఇంట్లో వాళ్లకి చెప్పి బయటకు వెళ్లాడు. వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. ఈ క్రమంలో ఇమాంబాద్ శివారులోని కాల్వలో గురువారం గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ విషయాన్ని మృతుడి ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో మృతుడి కుటుంబ సభ్యులు వాట్సాప్ ద్వారా తెలుసుకుని గుర్తించారు. మృతుడి భార్య కల్యాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనారోగ్యంతో ఉద్యమకారుడి మృతి


కనకయ్య (ఫైల్)

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ ఉద్యమకారుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లిలోని నిరుపేద కుటుంబానికి చెందిన కాసమొల్ల కనకయ్య ప్రత్యేక రాష్ట్ర సాధనకు ఏ కార్యక్రమం జరిగినా చురుగ్గా పాల్గొన్నాడు. గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు.

ఆర్థిక సాయం:


ఆర్థికసాయం అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ విషయం తెలుసుకొని గురువారం బాధిత కుటుంబానికి రూ. 25వేలు సాయం అందజేశారు. ఈ సందర్భంగా మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి కనకయ్య చేసిన సేవలు మరువలేనివన్నారు. పీఏసీఎస్ చైర్మన్ జేజేల వెంకటేశం, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, వైస్ ఎంపీపీ బెల్దె కృష్ణగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండ మధు, జెడ్పీటీసీ మల్లేశం తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఈ కార్యక్రమంలో రమేష్‌గౌడ్, మాధవరెడ్డి, గాలెంక శ్రీను, పోషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ..మైనర్ మృతి

- మరో బాలుడికి తీవ్ర గాయాలు, పరిస్థితి విషమం


శ్రీమాన్ (ఫైల్)


ప్రమాదానికి గురైన బైకును ఆటోలో పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న సిబ్బంది

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పట్టణంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్ ఆటో ఢీ కొన్న ఘటనలో బాలుడు మృతిచెందడంతో పాటు మరో బాలుడికి తీవ్ర గాయలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానికులు, సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని నాసర్‌పురాకు చెందిన తరిగొప్పుల శ్రీమాన్ (16), రేషం దివేంద్ర (18)లు చిన్నప్పటి నుంచి స్నేహితులు. వీరిద్దరూ పట్టణంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. గురువారం సాయంత్రం శ్రీమాన్, దివేంద్రలు ముస్తాబాద్ చౌరస్తా నుంచి పుల్లూరు వైపు వెళుతుండగా నిమ్రా గార్డెన్ ఎదురుగా, భారత్ పెట్రోలియం వద్ద ఆటోను వీరు ప్రయాణిస్తున్న బైక్ వేగంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి ఇద్దరు ఎగిరి రోడ్డుపై పడ్డారు. ఈ ఘటనలో శ్రీమాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. దివేంద్ర తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది గాయపడిన దివేంద్రను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి తలకు బలమైన గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ సిఐ బిక్షపతి తెలిపారు.

మందుబాబులకు జరిమానా, జైలు

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానాతో పాటు జైలు శిక్ష విధించింది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని పలు చౌరస్తాల్లో వారం రోజుల క్రితం తమ సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో 21 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ గురువారం పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన సిద్దిపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి రమేష్‌బాబు రూ.46,500లు జరిమానా విధించారు. ఒకరికి ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

ఓటు వేద్దాం ఇలా...



ఓటు ఏ విధంగా వేయాలి. ఈవీఎంలను ఎలా ఉపయోగించాలో గ్రామీణ, పట్టణ ఓటర్లకు ఎన్నికల అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం పట్టణంలోని నర్సాపూర్‌లో ఎన్నికల అధికారులు ఓటర్లను ఇలా నిలబెట్టి ఓటు వేయిస్తున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది .

–కె.సతీశ్, సాక్షిస్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట